# ★ క్షణంలో సగం ★

"శారద"

మొన్న ఒకడు గడవక ఊరొదిలి పోయినాడు. ఇంకొకడు గడవక శరీరమే వొదిలేశాడు! ఇద్దరిలో ఎవరు ఘనులు? ఈ ఇద్దరూ కాదనీ, దేశాన్నేలే ప్రబుద్ధులే ఘనులనీ నా దీపం అభిప్రాయం. అయితే ఇంతకన్న ఘనమైన కార్యక్రమంగూడా వుంది. అదేమిటి? ఆకలితో చచ్చేవాళ్లు చస్తూవుంటే-వాళ్ళట్లా చావటంగూడా ఇండియన్ పీనల్ కోడ్ ప్రకారం తప్పనే నిర్ణయానికి కొంతమంది అధికార్లు రానున్నారని... తెలీటం. ఏదిఏమైనా, మంచినీళ్ళకన్న మనిషిరక్తం విలువ తగ్గింది. దాన్ని ఖర్చుచెయ్యటానికి బాంబులూ, అధునికమైన కార్యక్రమాలూ హెచ్చిపోతున్నాయి.

భూమ్మీద 'జీవం' నశించటం ఏ రాజకీయవాది ఉద్దేశమూ కాదని రూఢిగా తెలుస్తూనే వుంటుంది. కానైతే వెధవధి, చీటికీమాటికీ ప్రాణం వొదిలేస్తారు వీళ్ళు. గుండ్రాయల్లే బతకటానికి ప్రణాళికలూ, ఉపన్యాసాలూ, గీతాలూ తోడ్పడవు వీళ్ళకి. బుద్ధుడికి పూర్వం నించి, ఇవ్వాళిటి 'ఆచార్య వినోబాభావే' వరకూ ఎందరు అహింసా సందేశాలు ఇస్తేనేం గాక! మనుషుల్ని కాశ్మీర్ లగాయతు కొరియా వరకూ, ఏదో ఒక కారణం చూపించి చంపుతూనే వున్నారు. ఇట్లా చంపేవాళ్లెవరికీ, గాంధీగారి ఉపదేశాలు కంఠగతం కాకుండానూ ఉండవు; సమయానికి మరుపు రాకుండానూ పోవు!

పత్రికల వాళ్ళమీద పరువునష్టం దావా వేసే వాళ్ళకి పబ్లిసిటీ "కాంక్ష" ఎక్కువ వుంటుందని 'సైకాలజీ' రీత్యా ఆలోచిస్తే తోస్తోంది. మనుషులకి ప్రాథమిక హక్కులకింద సంక్రమించవలసిన చాలా వాటిని తెలివిగా ముందే బందు చెయ్యటంవల్ల పరిపాలకవర్గాలకి రక్షణ ఏర్పడుతుందనే సూత్రాన్ని ప్రపంచానికి మొట్టమొదట, (ప్రజాస్వామ్యం పేరుతో) గా అందించిన కీర్తి, భారతరాజ్యాంగ చట్టానికే ఉండగలదు. అమెరికన్ డాలరిస్టులూ, బ్రిటిష్ టోరీలు-జర్మన్ నాజీలూ మన ముందు దిగదుడుపే. బలహీనుల్ని వేలాది సంవత్సరాలుగా అణగదొక్కటంలో వొచ్చిన అగ్రతాంబూలం నేడూ మనకే దక్కేట్టు చేసిన రాజ్యాంగచట్ట రచనా నిపుణలకి ప్రతి భారతీయుడూ ఎంతో ఋణపడివున్నాడు.

నేను ఈ వూరునించి ఇంకోవూరు వెళ్తాను. నాతోపాటే నా భావాలూ, భార్యా, అంతా వొస్తారు. ఎన్నటికీ అంతరించని రణగొణ ధ్వని ఏర్పడిపోయింది భూమ్మీద. ఏవూరుపోయినా ఈ గోల తప్పదు. పరిణామంలో మానవులు మారతారుట. సంఘర్షణలు లేకండా శాంతిగా వుంటే మారరూ? పోలీసులైతే నాగరికతను కాపాడుతూనే వున్నారు. ఒకడు తనని కరిచిన కుక్కని తిరిగి కరవటం జంతువులపట్ల 'మూర్ఖప్రవర్తన' అని అతణ్ణి అరెస్టు చేశారు వాళ్లు. ఇదికాదా ఒక జాతి నాగరికతా రక్షణకు సరైన ఉదాహరణ! వాస్తవానికి వీసమెత్తు మారకండా, మారినట్టే కనిపించే కుంభకోణమే ఈ శతాబ్దంలోని విశిష్టత.

మంత్రాలకు చింతకాయలు రాలవని చక్కగా తెలిసిన పత్రికలే, ఇంద్రుడు గురించి (వర్షాలకోసం) చేసే యజ్ఞాల వార్తల్ని పెద్ద లిపిలో ప్రకటించటం, వాటికి ప్రచారం ఇవ్వటం ఒక విశేషమే. ఇంతకన్నా విశేషం, దేశంలో ఎందరో రైతులకి పొలాలు చాలక చస్తోవుంటే వేల ఎకరాలు పొట్టపెట్టుకున్న-తిరపతి వెంకటేశ్వరుని పేరుతో ఉన్న - రాతి విగ్రహాల ఉత్సవవిగ్రహాల ఫొటోల్ని డెమ్మీ ఫుల్ పేజీ వ్యాసంతో ప్రకటించటం. అయినా ఈ దేశంలో అస్తికత్వంతో జరిగే అనేక మోసాల్లో ఇదీ ఒకటని మరో వేలుముడిచి ఊరుకోటమే. ఆంధ్రుల ఐక్యత మరోసారి అఖిల భారతావనికీ ప్రదర్శన మయ్యే శుభ ముహూర్తం' ఆసన్నమైంది. మురాలెలాగా ఏర్పడ్డాయి, దేన్ని కాదన్నా ప్రమాదమే.

కాంగ్రెస్ డెమోక్రసీకి విరుద్ధమే. కాంగ్రెస్ నిబంధనావళి ప్రకారం ముఠాలుండగూడదని ఏమీ తీర్మానం లేదు గనుక అన్ని ముఠాలూ రాజీపడి, (రాజీపడకపోతే) గంగలో దిగటం జరగబోతున్నది. కాంగ్రెస్ గంగ అన్నారు వేదాంతరావు. గంగలో పవిత్ర తోయమే గాక, కలరా, విషూచీ, క్రిమిదోష జలాలూ ఉంటాయనేది అజ్ఞానులకి ఈనాటికైనా తెలియ జేసినందుకు వేదాంతరావుకి కృతజ్ఞులం. ఏ నాయకుడు ఏంచెప్తేనేం? అక్షరాలు మార్చినా అర్థం ఒకటే ఐనప్పుడు! మనుషులున్నన్నాళ్లూ నీడలుంటాయి!

# మన నాయకులింక విరమించాలి

"రాఘువ భాషాప్రవీణ"

ఇటీవల జరిగిన నాసిక్ కాంగ్రెస్ అధ్యక్షుని యెన్నికలలో ఆంధ్రులు పాల్గొనలేకపోవడము ఆంధ్రదేశానికి మాయని మచ్చవంటిది. దీనికి బాధ్యులెవరు? ఆంధ్ర ప్రజానీకమా? లేక నాయకులా? ముమ్మాటికీనాయకులే. స్వార్థము, పార్టీ రాజకీయాలు ఇంత ముప్పును తెచ్చి పెట్టాయి. నాయకుల వలన ప్రజలకు కీర్తి ప్రతిష్ఠలు రావలసినదానికి బదులుగా తల యెత్తరాని అవమానము ఆంధ్రులకు కలిగినది. ఈ పార్టీ రాజకీయాలతో ప్రజలకు నిమిత్తము లేదు. రంగాగారు అధ్యక్షులైనా ఒకటే కళావారు అయినా ఒకటే. స్వరాజ్యం వస్తే ఏదో నెత్తిమీద ఒరుగుతుందని భావించిన సామాన్య ప్రజ ఆ యాశకు తిలోదకా లిచ్చుకోవలసి వచ్చినది. కడుపునిండుగా తిండి, కట్టుకోవడానికి గుడ్డ, ఉండడానికి ఇల్లు సమకూర్చలేని ప్రభుత్వము యొక్క అశక్తతను తలచుకొని క్రుంగిపోతున్న ప్రజలకు అధికార వ్యామోహితులై పార్టీరాజకీయాలను పట్టుకొని పాకులాడుతుండే యీ నాయకుల వలన కలిగే అవమానం మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్టయింది.

సామాన్య ప్రజానీకానికి కూడు, గుడ్డ, ఇల్లు, ఏ ప్రభుత్వం ఇవ్వగలుగుతుందో ఆ ప్రభుత్వమే ప్రజలకు కావాలి. అది కాంగ్రెస్ ఐనాసరే, కమ్యూనిస్టు ఐనాసరే, సోషలిస్టు ఐనాసరే ప్రజలకు అవసరములేదు. ఈ పార్టీ భేదాలు అధికార వ్యామోహితులైన కొందరు నాయకమ్మన్యులకు గాని ప్రజలకు ఏపార్టీయైనాసరే.

రాష్ట్ర కాంగ్రెస్‌వారిపై ధ్వజమెత్తేవారికి కాంగ్రెస్ అధ్యక్ష కార్యదర్శులు ప్రక్కతాళం వేస్తుండబట్టే ఆంధ్రదేశ నాయకులలో క్రమశిక్షణ రసాతలలోకానికి పోయింది. ఆంధ్రులకు కాంగ్రెస్ అధ్యక్షపదవి రానంత కాలము మనము దుమ్మెత్తిపోశాము, పూర్వపుణ్యవిశేషంచేత ఆంధ్రులు అధ్యక్ష కార్యదర్శులయారు. ఆ హోదాలను ఆధారముగ తీసికొని రాష్ట్ర కాంగ్రెస్‌ను అణచాలని ప్రయత్నించారు. వారా పదవులకు రానిక్రితము సాధారణ సభ్యులుగ నుండి రాష్ట్ర కాంగ్రెసును ఏమీచేయలేక అధికారము వచ్చిన తరువాత తమ పూర్వపు విరోధాన్ని వడ్డీతో సహా పుచ్చుకోవడానికి ప్రయత్నించి, ఆంధ్రదేశంలో పార్టీలు లేవదీసి కొంతమందిచే ధ్వజం.ఎత్తించారు. వడ్డించేవాడు మనవాడైతే అనే సామెతగా కాంగ్రెస్ మూలసూత్రాలకు వ్యతిరేకముగా నాయకమ్మన్యులందరూ ప్రచారం చేశారు. ఉన్నత పదవులలో ఉండే అధ్యక్ష కార్యదర్శులే నిష్పాక్షికులుగాలేక పార్టీ నాయకుల్లాగ ప్రవర్తించారు. సులోచనాలను మార్చుకోవాలని సలహాలివ్వడం కంటె తమ చిత్తవృత్తిని మార్చుకోవాలి. అట్లు జరిగి వుంటే ఆంధ్రదేశంలో కాంగ్రెస్ స్థితి ఇంత అధోగతిలోకి వచ్చి ఉండేదికాదు. ఈ నాయకులు రాజకీయ రంగంలోంచి తొలగకపోతే ఆంధ్రులు యుగయుగాంతరాలకు కూడ తలలెత్తలేరు. పార్టీ రాజకీయాలను పట్టుకొని స్వార్థంకోసం ప్రయత్నించుకుంటూ అమాయకులైన ప్రజలకు అవమానం, కన్నతల్లికి సర్వనాశనం తీసుకురావడం కంటె ఈ తల నెరసిన నాయకులు రాజకీయ రంగంనుంచి తొలగి ఏ భూగృహంలోనో ముక్కు మూసుకొని తపస్సుచేస్తూ కూర్చుంటే వారికీ, ప్రజలకూ, ముక్తి కలుగుతుంది.